# నా జీవితంలో పున్నమివెన్నెల....

శ్రీమతి కె. శారదాదేవి

"అనూరాధా"

ఎవరో ఒక వ్యక్తి నా భిక్షుకి వేషంలో నన్ను గుర్తుపట్టగలిగాడని నన్ను నేను మరచి స్తంభించి నిలుచుండిపోయాను.

మరల వినుపించింది "అనూరాధా" యన్న పరిచయమయిన పిలుపు. వెనక్కి తిరిగి చూస్తును కదా—ఆ పెద్ద బంగాళాముందు సుదర్శన్ నిల్చుని నావైపు టార్చిలైటు వేశాడు. నావైపే నడచి వస్తున్నట్లు గూడ తోచింది. అతడు దగ్గరగా వచ్చి ఆశ్చర్యంతో "యిలా వచ్చావేం? ఇంతటి నిశీథ సమయంలో భిక్షానికా నీవు రావడము? నిన్ను నేను పోల్చలేకపోయాను క్షమించవూ?. అప్రయత్నంగా అతని గొంతుక గద్గదితమైంది. కన్నులనుండి అశ్రుకణాలు టార్చిమీదకు రాలాయి.

"సుదర్శన్" అని స్తంభించిపోయాను. అతని కళ్ళల్లో నీరు అలానే వున్నాయి. కాని, అతన్ని చూడగా నాస్థితి మరచిపోయి అతన్ని పరకాయించి చూస్తున్నాను.

మీదవేసుకున్న దుప్పటి ముసుగును ముఖం లాగుకున్నా. దుఃఖం ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చినాను. ప్రయత్నించినా మాట నోటరాలేదు.

అతడు మరలా "ఏమమ్మా ఎందుకలా దుఃఖిస్తున్నావు. నాతో చెప్పితే సాధ్యమయినంత వరకూ నీకష్టం తీర్చగలనని నమ్ముతున్నాను" మా యింటికి పోదాం రమ్మని బ్రతిమాలాడు.

"వద్దుబాబూ దిక్కులేని పక్షిని, భిక్షుకి, అనాధనయిన నాకు ఈ విశాలప్రపంచంలో చోటు లేదు, వద్దు...మన్నించండి...నన్ను పోనివ్వండి."

"గదిలో లోపలనున్న నాకు నీపిలుపు మొదట వినబడలేదు. తరువాత నీకంఠమానవాలుపట్టి సందేహించాను. కాని తీరావచ్చిచూడగా నీవే—నిజంగా—నీవే. నాకన్నులను నేను నమ్మలేదు. నేను కూడా యింకా భోజనం చేయలేదు. ఈ దినం నీవు మాయింటికి అతిథివి. నా ఆతిథ్యాన్ని స్వీకరించవూ?" అని బ్రతిమాలి నిష్ఠురాలాడినాడు. వెళ్లక తప్పిందిగాదు. అందులోను క్లాస్ మేటు. నేనదివరలో అతనితో నెప్పుడూ మాట్లాడిందిగూడ లేదు. అతనితో నేనెట్లు భోంచేసేది? యనుకున్నా, అందులోనూ వంటరిగా నున్నాడేమో. స్థితిమంతుడు. నేనా భిక్షుకి, యువతిని, అనాధను అతనితో ఆ రాత్రి వాళ్ళింటికి ఎలాపోయేది? ఇటువంటి ఆలోచనలోపడి కడకు ఆకలిబాధకు తట్టుకోలేక అంగీకరించాను.

అతని గదిలో అతనొక కుర్చీమీద, నేనొక కుర్చీమీదా కూర్చున్నాము. అంతలో అతని తల్లి మనోరమాదేవిని పిల్చి నన్ను ఆమెకు పరిచయం చేశాడు. ఆమెకూడ బాగా పల్కరించింది; అందరి భోజనాలూ ముగిసిన తర్వాత తాంబూలం సేవిస్తూ హాల్లో కూర్చున్నాము. అప్పుడు ఆతల్లీ, కొడుకూ లిద్దరూ నన్ను నాకథచెప్పమని బ్రతిమాలారు.

* * *

మా నాన్న కలెక్టరు ఆఫీసులో క్లర్కుగా పని చేస్తూండేవారుట. కాని నేను పుట్టేముందు మూడు నెలలకు లోపుగానే మా నాన్న కాలంచేశారుట. మాఅమ్మ నన్ను, మా అన్నయ్యను కొన్నాళ్ళు కష్టపడి కూలిచేసి పోషించి, కాని నేను సంవత్సరం

పిల్లగా నున్నప్పుడే మా అన్నయ్యను ఎవరో కరుణా రావుగారని తాసీల్దారు పెంచుకుంటానికి తీసుకున్నారట. అంతే—మా అన్నయ్యను మరి నేను చూడలేదు. మాఅమ్మ అంటూవుండేది. "నువ్వు అచ్చంగా మీనాన్నగారిలా వున్నావు. మీ అన్నయ్య నాలాగు వుంటాడు. ఎక్కడున్నాడో ఏ దేశంలో నున్నాడో ... గర్భదరిద్రను. పిల్లవాణ్ణి పెంచలేక యిచ్చివేశాను. నాదరిద్రమిలా కాలింది" అని ఏమేమో అనుకుని వాపోయేది. నేను స్కాలర్‌షిప్పు వల్ల ఎల్లాగో స్కూలుఫైనలు తరగతి కొచ్చాను. మా అమ్మ బ్రతికుండగా అంటుండేది "మా అమ్మాయిని స్కూలుఫైనలు పాసవగానే కాకినాడ పంపి అక్కడ పిఠాపురం మహారాజావారి కాలేజీలో చదివించుకుంటాను. అదే పెద్దదై ఏదయిన వుద్యోగంచేస్తే నా కష్టాలు దరిజేరుతాయి. నా కొడుకయినా నాకు లేకపోయె. కూతురయినా మా అమ్మాయే" నని యిరుగుపొరుగువారితో చెప్పుతూండడము నేను విన్నాను.

నేను సెలవుల్లో మాఅమ్మ కుట్టేమిషను మీద గుడ్డలుకుట్టి బ్రతుకుతూ సెలవులు గడిపాను. తరువాత మిషను అమ్మేసి, ఆడబ్బుతో యీ కాకినాడ వచ్చాను. కాలేజీలో కూడ జీతము, పుస్తకాలు, అన్నము అన్నీ ఫ్రీగా జరిగే ఏర్పాటులు నాకు లభించాయి. ఫస్టుటర్ము (first term) మూడు నెలలూ హాస్టలులోనుండి చదువుకున్నాను. కాలేజీకి సెలవులు వచ్చాయి. హాస్టలునుండి బయటికి వచ్చాను నా పెట్టీ, పరుపూ తీసుకుని. ఈ పెద్దపట్టణంలో నాకు ఎక్కడుండాలో కడకు విశ్రమించటానికి చత్రమెక్కడుందో నాకు తెలియదు. ఇక్కడికి దగ్గరగానున్న దేవాలయంలో రెండురోజులున్నాను. ఉన్న ఆరెండురోజులూ నీళ్ళతోటి కడుపునింపాను. ఇక ఆకలికి తట్టుకోలేకపోయాను. ఈనాటే సుమారు యిరవై గుమ్మాలయినా ఎక్కివుంటాను. కాని యే దయామయురాలుకూడ కనికరించి నాకు పిడికెడన్నము పెట్టిన పాపానపోలేదు. పగలు రావాలంటే మొగమాటం. అందుచేత యీరాత్రి యిలా ముసుగువేసుకుని బయల్దేరాను. ఇది మీ యిల్లని నాకిదివరకు తెలియదు, ఇదీ నా చరిత్ర అంటూ ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాను.

అంతవరకూ నేను వాళ్లిద్దరి ముఖాలు పరికించలేదు. కన్నీళ్లు కళ్ళకడ్డంగా తెరలాగుండిపోయాయి. వాళ్ళిద్దరి ముఖాల్లోను ఆశ్చర్యం, ఆనందం కనుపించింది. సుదర్శన్ వైపు దీక్షగా చూస్తే, అతడూ నాకళ్ళల్లోకి చూశాడు. అతని కళ్ళలోని ప్రేమజ్యోతి మాఅమ్మకళ్ళల్లో నగుపించేది. ఆముఖంలోని సౌజన్యమూ మాఅమ్మదే. మూడుమూర్తులా మాఅమ్మపోలిక నుపించింది. పరవశమందిపోయి ఆనందంతో అలా నేవున్నా. మాఅమ్మ జ్ఞాపకం రాగానే భోరున ఏడ్చాను.

సుదర్శన్ నాదగ్గరకు వచ్చి తల నప్యాయంగా నిమిరి పాపట్లోముద్దుపెట్టుకుని "చెల్లీ నీవు నాచెల్లివి సుమా. నేను నీముఖం కాలేజీలో చూచినప్పుడల్లా ఏదో పూర్వస్మృతి కలిగి నాకు తెలియరాని ప్రేమ భావం నీపై కలుగుతుండేది. కాని నేడు నిన్ను చూచి, నీకథ విన్నప్పుడు నాహృదయంలో కలిగే ఆ భావం...ఆ తెలియరాని ప్రేమ...సోదరీప్రేమయే సుమా. అబ్బ! దైవం మరల నాయనుంగు చెల్లెలిని నాకు సమకూర్చాడు. నేడు ఎంత సుదినము! ఇన్ని ఏండ్లకు ... అనగా పదహారు సంవత్సరాలకిగాను యీనాడు కలుసుకున్నాం."

నేను మాఅన్నయ్య ఒడిలో తలనిముడ్చి తల్లి మరణించిన వార్త తలుచుకుని యిద్దరం ఏడ్చాము.

ఇంతలో కరుణారావుగారు కూడ కేంపునుండి యింటికి రావడమూ, నా చరిత్ర విని నన్ను చాలా ఆదరించడమూ జరిగాయి. ఆయన "అమ్మాయీ విచారించకు. మేమే నీకు తల్లి తండ్రీ అనుకో. ఇక్కడే వుండి మీఅన్నయ్యతో కలిసి కాలేజీలో చదువుకో" మన్నారు.

అప్పట్నుంచి నేను వారింట్లోనే వుండి మా అన్నయ్యతో కూడ కలిసి కాలేజీకి రావడమూ, జరుగుతోంది... లలితా! నాజీవితంలో అమావాస్య గడ్డుదినములు గడిచాయి. హృదయాకాశంలో చంద్రుడుదయించాడు. నాజీవితంలో యిది పున్నమ వెన్నెల." అని తన కథ ముగించింది అనూరాధ.

"అదే నాకు మొదట అర్థమవలేదు. నీవు అతనూ కలిసి రావడమూ చనువుగా మాట్లాడడమూ చూచి క్లాసులో గుసగుసలు బయల్దేరాయి. అందుచేత యిలా అడిగాను. అయినా చాల మంచిపనే జరిగింది. ఇంతవరకూ నీవు తల్లిదండ్రి, బంధువులు లేనిదానవని నాకు తెలీదు. లేకుంటే మాయింట్లో నయినా వుంచుకొనేదాన్ని." అని ఆశ్చర్యంతో లలిత అంటూండగా అనూరాధ ఆమె భుజంమీద ప్రేమతో తట్టి, యిద్దరూ క్లాసుకు వెళ్లారు; అప్పుడే బెల్లు (Bell) అవడంచేత.

---

## కృత్రిమపు వెన్నెల

బ్రిటన్‌లో రైల్వే కర్మాగారాలనుంచి చీకటి చాటున దొంగలు కొన్ని లక్షల పౌనుల విలువగల యంత్రవస్తు పరికరాలను అపహరిస్తూ వుండడంవల్ల 50 అడుగుల యెత్తు కొయ్యలకు మెర్క్యూరి వేపర్ లాంపులనుఏర్పాటుచేసి చోరీలకు అవకాశంలేకుండా చెయ్యడానికి బ్రిటిష్ ప్రభుత్వాధికారులు యోచిస్తున్నారు. ఈ లాంపులవల్ల వ్యాపించేకాంతి అచ్చంగా వెన్నెలమాదిరిగానే వుంటుందట.

(60 వ పేజీ తరువాయి)

నెలకు రెండువందలు సంపాయిస్తున్నాడు. ఎంతో ప్రాపకంవుంది. వదినె యెందుకనాలి ఆవిధంగా? విరుద్ధ మనఃప్రవృత్తులుగలిగి పరస్పరంగా ఆకళింపు చేసుకోనంతకాలమూ, భార్యాభర్తల్లో ఎవరోఒకరు బాధపడుతూనే వుంటారు.

'వదినా! మాట్లాడవేం? అన్నాయ్ తప్పకుండా రేపటికి తిరిగొస్తాడులే వదినా!' అని పిలిచింది సీత.

సుశీ మాటా పలుకూ లేకుండా క్రిందపడిపోయింది. ఎలాగో సీత మంచంమీదికి చేర్చింది. ప్రక్కనకూచోని సపర్యలుచేస్తోంది.

నలువేపులా చీకట్లు క్రమ్ముకొచ్చాయి. ప్రక్కన కూర్చొని సీత రోదిస్తోంది. తీవ్రంగావున్న ఆజ్వరంలోనే సుశీ అప్పుడప్పుడు నిర్ధనుడు, కురూపి, అనామకుడని పలవరిస్తోంది. ఈమాటలు విన్నప్పుడల్లా సీత హృదయంలో కలకవేస్తోంది. రాత్రంతా అదేవిధంగా గడిచింది.

ఉదయమయేసరికి సుశీ జ్వరం తీవ్రరూపం దాల్చింది. సీత ప్రక్కనేవుంది. వణికిపోతూన్న శరీరంతో సుశీ ముఖంలో ముఖంపెట్టి చూచింది. ఆ చూపులు—'అన్నాయ్ అనామకుడని' చెబుతున్నట్లుగా తోచాయి.

ఆ చూపులతోనే సుశీ మృత్యుముఖంలోకి పయనమై వెళ్ళింది. అప్పుడే బయట కారు ఆగిన చప్పుడయింది. సీత 'వదినా!' అని కేకేసి క్రింద పడిపోయింది.

చక్కని కథలకు కథాంజలి చదవండి.

Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St. G. T. Madras.
Prnted by V. Kuppuswamy Chetty at Bharatamata press, 39, Anderson Street, G. T. Madras.